www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం
28 మే 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రెయగల వెరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003





## దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం

2లో



ప్రధాని నరేంద్ర మోదీ

- ఉగ్రదాడులతో భారత్‌లో అశాంతి సృష్టిస్తే మౌనంగా ఉండబోము
- సర్దార్ పటేల్ మాట విని ఉంటే 76 ఏళ్లుగా ఉగ్రదాడులు ఉండేవి కాదు
- పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఒక యుద్ధ వ్యూహంగా అనుసరిస్తోంది
- టెర్రరిస్టులకు ప్రభుత్వ లాంఛనలతో అంత్యక్రియలా?
- రెండో రోజు గాంధీనగర్‌లో ప్రధాని పర్యటన..
- రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన



## కూలక ముందే కూల్చేయండి

2లో

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

- శిథిలావస్థదశలో ఉన్న నిర్మాణాలను కూల్చేయండి

## 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

3లో

లొంగిపోయిన వారికి పునరావాస ఉపాధి

2 కలంజ్యోతి
బుధవారం 28.05.2025 General News

# కూలక ముందే కూల్చేయండి

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో శిథిలావస్థ దశకు చేరిన నిర్మాణాలను సివిల్ ఇంజినీరింగ్ విభాగం నిపుణులతో తనిఖీ చేయించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. అవి ప్రమాదకరంగా మారక ముందే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 26న శిథిలావస్థ దశకు చేరుకున్న ఫతేనగర్ వంతెన మెట్లపై నుంచి దిగుతుండగా అవి విరిగిపడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ప్రతి ఆదివారం సనత్‌నగర్‌లో సంత జరుగుతుందని.. ఆ సమయంలో వందలాది మంది మెట్ల మార్గాన్ని వినియోగిస్తారని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు కమిషనర్ మంగళవారం మెట్ల మార్గాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న మెట్లపై నుంచి రాకపోకలు సాగించడం సరికాదని నిర్ధారణకు వచ్చారు. వంతెనకు ఆనుకుని ఏర్పాటు చేసిన మెట్లను పూర్తిగా తొలగించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ఫతేనగర్ వంతెనకు ఆనుకుని నిర్మించిన మెట్లను హైడ్రా డిజాస్టర్ సిబ్బంది జేసీబీతో తొలగించారు. కొత్తగా అక్కడ మెట్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు.



# ప్రభుత్వ పాఠశాలను కాపాడుదాం

## సంగారెడ్డి జిల్లా టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి సాయిలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంగారెడ్డి జిల్లా టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి సాయిలు అన్నారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి, నాణ్యమైన విద్య పొందాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'బడిబాట జీపుయాత్ర' సోమవారం హత్నూర మండలంలోని గుండ్ల మాచునూర, బొక్కలగూడెం, పల్పనూరు, బోరుపట్ల, రెడ్డి ఖానాపూర్, కాసాల గ్రామాల మీదుగా దౌల్తాబాద్ చేరుకున్న సందర్భంగా సాయిలు విలేకరులతో మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ యూటీఎఫ్ బడిబాట నిర్వహిస్తుందని తెలిపారు. మా సంఘం కేవలం ఉపాధ్యాయుల జీతాలు, డీఏలు, పీఆర్సీల కోసమే పోరాటాలు చేయడమే కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు, ప్రభుత్వ బడుల పిల్లల నమోదు (ఎన్రోల్మెంట్) పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ జాత నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జిల్లా కోశాధికారి పి.శ్రీనివాసరావు ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్ర రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



# దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం



**గాంధీనగర్ :** దేశంలో ఉగ్రవాద దాడుల ద్వారా అశాంతి సృష్టించాలని చూస్తే సహించేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాకిస్థాన్‌ను హెచ్చరించారు. ఒక శరీరం ఎంత బలంగా ఉన్నా, ఒక ముల్లు గుచ్చుకుంటే ఎంతో నొప్పి కలుగుతుందని, పాకిస్థాన్ మద్దతుతో దేశంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదమే ఆ ముల్లు అని, దాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందని గుర్తు చేశారు. గుజరాత్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లో మంగళవారం రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని.. దేశ భద్రత, అభివృద్ధి, సంస్కృతి, జాతీయ గౌరవం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని ప్రతి మూలలో దేశభక్తిని చూశానని, ఇది కేవలం గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ప్రతి భారతీయుడి హృదయంలో ఉందని మోదీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి మాట్లాడారు.

**పాక్‌పై ఘాటు విమర్శలు...**

'ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఒక యుద్ధ తంత్రంగా మార్చుకుందని మోదీ పేర్కొన్నారు. దీనిని భారత్ సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. 'పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల అంత్యక్రియలకు ఆ దేశ ప్రభుత్వ అధికారులు హాజరై, ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. వారి సైన్యం కూడా ఉగ్రవాదులకు సెల్యూట్ చేసింది. ఇది ఉగ్రవాదం కేవలం పరోక్ష యుద్ధం కాదు, పాకిస్థాన్ అనుసరిస్తున్న యుద్ధ వ్యూహమని స్పష్టం చేస్తోంది. దీనికి తగిన రీతిలోనే భారత్ స్పందిస్తుంది' అని మోదీ తేల్చిచెప్పారు. తాము శాంతినే కోరుకుంటామని, ఇతరులు కూడా శాంతియుతంగా ఉండాలనే ఆకాంక్షిస్తామని, అయితే పరోక్ష యుద్ధంతో తమ సహనాన్ని పరీక్షిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 1947 నాటి దేశ విభజనను ప్రస్తావిస్తూ, '1947లో దేశం రెండుగా చీలిన రోజే, కశ్మీర్‌లో తొలి ఉగ్రదాడి జరిగింది. సాయుధ ముఠాల సాయంతో పాకిస్థాన్ కశ్మీర్‌లోని కొంత భాగాన్ని ఆక్రమించుకుంది. ఆనాడు ఉగ్రవాదులను ఏరివేసి, ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఇచ్చిన సలహాను పాటించి ఉంటే, దేశంలో ఈ ఉగ్రదాడుల పరంపర కొనసాగేది కాదు. కానీ అప్పటి ఇజ రుగుతున్నాయని, ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు.

**ఉగ్రస్థావరాలపై భారత్ దాడులు..**


ఇటీవలి కాలంలో జరిగిన భారత ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి కూడా ప్రధాని వివరించారు. 22 నిమిషాల్లో భారత్ 9 పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇది కెమెరాల ముందే జరిగింది. ఇక రుజువుల కోసం ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. శవపేటికలపై పాక్ జెండాలు పెట్టి, వారికి సెల్యూట్ చేయడం ద్వారా, వారు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా దేశ భద్రతపై మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఎదుర్కొంటామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

**అభివృద్ధికి అంకితభావం**

'2014 మే 26న నేను ప్రధాని పదవిని స్వీకరించాను. అప్పటి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానం. కానీ ప్రస్తుతం అది నాలుగో స్థానానికి చేరిందని మోదీ గుర్తు చేశారు. ప్రపంచమంతా కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత దేశం తన గమ్యాన్ని వదులుకోలేదని ఆయన అన్నారు. మన లక్ష్యం 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్. స్వాతంత్ర్యం పొందిన 100 సంవత్సరాల సందర్భంగా, మన దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. శాంతియుత సహజీవనం భారత్ లక్ష్యమని, కానీ, ఆ శాంతిని సవాలు చేస్తే, భారతదేశం తక్షణమే స్పందిస్తుందని, ఇది వీరుల భూమి అని మోదీ వెల్లడించారు.

# పిడుగుపాటుతో యువకుడి మృతి

## రుద్రవరం గ్రామంలో విషాదఛాయలు



**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ్ (26) అనే యువ గొర్లకాపారి మంగళవారం పిడుగుపాటు ఘటనలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామశివారులో జరిగింది. లక్ష్మణ్ తలపైన పిడుగుపాటు జరిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్టు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కలంజ్యోతి 3
బుధవారం 28.05.2025 General News

# సుక్మాలో 18 మంది మావోయిస్టుల
# లొంగుబాటు

## లొంగిపోయిన వారికి పునరావాస ఉపాధి



**రాయ్‌పుర్ :** ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలోని 10 మందిపై మొత్తం రూ.38 లక్షల రివార్డు ఉంది. పీఎల్‌జీఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా మొత్తం 18 మంది సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు మంగళవారం లొంగిపోయారు. అమానవీయమైన, శుష్క మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై అరాచకాలు, తదితర చర్యలకు విసిగి తాము లొంగిపోయినట్టు వారు వెల్లడించారని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ చెప్పారు. మారుమూల గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నియాద్ నెల్లనార్ ( మీ మంచి గ్రామం) పథకానికి ప్రభావితమయ్యామని వారు పేర్కొన్నారని ఎస్పీ చెప్పారు.

అలాగే పునరావాస విధానం వల్ల వారు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు పీఎల్ జీఏ బెటాలియన్ నంబర్ .1 ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు మడ్కమ్ ఆయతా(25), అదే బెటాలియన్ సభ్యుడు భాస్కర్ అలియాస్ భోగం లక్క (26) ఉన్నారు. వీరిపై చెరో రూ.8 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులు మడ్కమ్ కమ్లు (25), లక్ష్మణ్ అలియాస్ మద్వీ చాన్ను (28) పై చెరో రూ.5 లక్షల రివార్డు ఉంది. మిగతా ఆరుగురిపై రూ.2 లక్షల వంతున రివార్డు ఉంది. లొంగిపోయిన వీరందరికీ రూ.50 వేలు వంతున ఆర్థిక సాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం తదుపరి పునరావాసం కల్పిస్తామని ఎస్పి తెలిపారు. సుక్మాతో కలిపి బస్తర్ రీజియన్‌లో గత ఏడాది 792 మంది నక్సల్స్ లొంగిపోయారు.

### పార్టీలో కలకలం..

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు ఓ లేఖ విడుదల చేశారు. లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారం మేరకే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. 6 నెలలుగా మాడ్ ప్రాంతంలోనే నంబాల ఉన్నట్లు ప్రకటించారు. కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు మావోయిస్టులు ఇటీవలే లొంగిపోయారని మావోయిస్టులు ఆ లేఖలో తెలిపారు. వారిచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. కేశవరావును సురక్షిత ప్రాంతానికి తరలిస్తామంటే ఆయన ఒప్పుకోలేదని, కేశవరావు కోసం 35 మంది ప్రాణాలు అడ్డుపెడితే ఏడుగురం సురక్షితంగా బయటపడ్డామన్నారు. 27 మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని చెప్పారు. స్పెషల్ జోనల్ కమిటీ వికల్ప్ పేరుతో ఈ లేఖను మావోయిస్టులు విడుదల చేశారు.

# కొండగట్టులో భక్తుల రద్దీ

**కలంజ్యోతి, మల్యాల :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొన్నది. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ అర్చకులు స్వామివారిని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు తలనీలాలు సమర్పించుకొని పుష్కరణిలో స్నానం ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూలైన్ ద్వారా వెళ్లి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ వ్రతాలు, అభిషేకములు, కుంకుమ పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. దీంతో ఉప ఆలయాలైన బేతాళస్వామి, రామ ఆలయం భక్తులతో సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.






## సీఎస్‌తో అల్లోల భేటీ

**కలంజ్యోతి, నిర్మల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంనూతన ప్రధానకార్యదర్శిగా నియుక్తులైన కె రామకృష్ణారావును మాజీ మంత్రి అల్లోల మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరేలా సాధారణ ప్రజలకు ప్రభుత్వం అందుబాటులో ఉండేలా ప్రభుత్వానికి ,ప్రజలకు మధ్య బలమైన వారధిగా ఉంటూ ఉత్తమ మైన పరిపాలనకు దోహదపడేలా ముందుకు సాగాలని మాజీ మంత్రి అల్లోల ఆకాంక్షించారు.

## పోలీసుల సంరక్షణలో బాలిక



**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్ రావు నగర్ కాలనీలో మంగళవారం 8 ఏళ్ల బాలిక తప్పిపోయింది. అయితే బాలికను గుర్తించిన పోలీసులు ఆమెను తమ సంరక్షణలో ఉంచారు. తన పేరు జ్యోతిక, తల్లిదండ్రుల పేర్లు అఖిల నవీన్ అని చెబుతుందని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఎవరైనా ఈ పాపను గుర్తిస్తే 87125 68116 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



## ఆర్మీ జవాన్ కు ఘన సన్మానం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** వెల్జిపుర్ గ్రామానికి చెందిన గొల్లకోమటి అనిల్ దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాడు. మొన్నటి ఇండియా -పాక్ మధ్య జరిగిన యుద్ధం ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్నాడు. సొంత గ్రామానికి చేరుకున్న అనిల్ ను గ్రామస్తులు శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లకోమటి శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు గుండ వెంకటేశం, బొల్లారం పరుశరాములు, కంకణాల నరేష్ రెడ్డి, సోనవేని పరుశరాములు, సోమిరెడ్డి అనిల్ రెడ్డి, గుండ బాబు, బోదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## 31న ఛలో వరంగల్

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సోమవారం ఢిల్లీలో పద్మశ్రీ అవార్డు అందు కున్నారు. రైలు మార్గం ద్వారా ఈ నెల 31న ఉదయం 10 గంటలకు వరంగల్ కు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్ద ఎత్తున స్వాగతం పలకడానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి గ్రామంనుంచి తరలిరావాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్ మాదిగ, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు, సావనపెల్లి బాలయ్య మాదిగ, కోనరావుపేట మండల అధ్యక్షులు కొమ్ము రాజశేఖర్ మాదిగ, చందుర్తి మండల ఉపాధ్యక్షులు ఆవునూరి రాజు మాదిగ, జిల్లా నాయకులు సామల్ల ప్రతాప్ మాదిగ, నల్ల బాబుమాదిగ కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ఇన్ చార్జీగా మల్లాడి వీరారెడ్డి



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ఇన్ చార్జీగా ఝల్లి గ్రామానికి చెందిన మల్లాడి వీరారెడ్డిని నియమించినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్, జిల్లా అధ్య క్షులు నందగిరి రజనీకాంత్, జిల్లా ప్రధానకార్యదర్శి కావడగాని రాజీవ్, మండల అధ్యక్షుడు ఉప్పునూతల లింగమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వీరారెడ్డి తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఫోరం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండలంలోని పాపయ్యపేటకు చెందిన కంచ శిరీష అన్నారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. ఆర్థిక ఇబ్బందుల్లో సీఎం రిలీఫ్ దరఖాస్తు చేసుకోగా రూ.58వేలు మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ బాధితురాలికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, ఉప్పరి వీరస్వామి, మాజీ ఎంపీటీసీ ఉప్పరి రామచంద్రు, మొర్రి వీరస్వామి, మాజీ వార్డ్ మెంబర్ కన్నం వెంకన్న, మండల రవి, ఉప్పరి కొమరయ్య, కన్నం కుమార్, కుండే కుమారస్వామి, బానోత్ పంతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## గుంటకండ్ల సావిత్రమ్మ 12వ వర్ధంతి ఘన నివాళులు

**కలంజ్యోతి, నాగారం :** నాగారం మండల కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాతృమూర్తి గుంటకండ్ల సావిత్రమ్మ 11వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యుల తో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ శ్రేణులు గ్రామ ప్రజలు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమం లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కళ్లెట్లపల్లి ఉప్పలయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కళ్లెట్లపల్లి శోభన్ బాబు, మాజీ ఎంపీపీ కూరంమణి వెంకన్న, చిప్పలపల్లి సోమయ్య, కోట సోమలింగం, చిప్పలపల్లి చిరంజీవి, గ్రామశాఖ అధ్యక్షులు ఎల్క సైదులు, కన్నెబోయిన మల్లేష్, తీగుళ్ల యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ కన్నెబోయిన భద్రయ్య, నాయకులు చిప్పలపల్లి మల్లేష్, అంజయ్య, పాశం శ్రీను, బుర్రి సురేష్ రెడ్డి, ఆవుల బాను, శ్రీను, ననుబోతుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి సీతక్క



**కలంజ్యోతి, నిర్మల్ :** సొంత ఇల్లులేని నిరుపేదలందరికీ సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అన్నారు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం బ్రాహ్మణగావ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రి సీతక్కకు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం భవనంలోని గదులను పరిశీలించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యగా ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. అనంతరం దౌనెల్లి నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు, తానూర్ బిటి రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకుగాను శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ దాదాపు రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగా రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ.1.90 కోట్లతో కుంటాల-దౌనెల్లి బీటీ రోడ్, రూ.5.90 కోట్లతో తానూర్-హుండా బీటీ రోడ్ రెన్యువల్, రూ.10 కోట్లతో ముధోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. బ్రాహ్మణగావ్ ఎత్తిపోతల పనులకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ దశలవారీగా అందరికీ ఇండ్లు కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని, ఎవరికైనా అనర్హులకు ఇండ్లు మంజూరైనట్టు అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించబడ్డాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మహిళా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, శాసనసభ్యులు రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు

## వలస సుభాష్ చంద్ర బోస్ నేత



**కలంజ్యోతి, జగిత్యాల:** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్ర బోస్ నేత పిలుపునిచ్చారు. జగి త్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ విద్య నా హక్కు బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం అని నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటి బాలలే నవ భారత నిర్మాణ వ్యక్తులుగా తయారు కావాలని అన్నారు. బాలలు పనులు చేయకండి పలక బలపం పట్టండి అని చిన్నారి పిల్లలను వేడుకున్నారు. రాష్ట్ర ప్రభు త్వం బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బాలల హక్కులను కాల రాయవద్దని, స్వేచ్ఛగా ఉండే వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి చిన్న విషయంలో పిల్లలను మందలించవద్దని అన్నారు. బాలలు బడిలో ఉండాలని పనిలో ఉంటే నేరమ న్నారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్త యిన ఇంకా బాల కార్మిక వ్యవస్థ కొనసాగడం సిగ్గుచేటని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూల నకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

కలంజ్యోతి
బుధవారం 28.05.2025 General News
5

# రోడ్లపై ఆక్రమణలు..

# తరచూ ప్రమాదాలు

## అన్యాక్రాంతమవుతున్న సర్కారు భూములు

### కలెక్టర్ కు సిటిజన్ ఫోరం వినతి



**కలంజ్యోతి, నిర్మల్ :** వడ్డించే వాడు మనవడైతే మనం ఎక్కడున్నా మనకు అందుతుంది అన్న నానుడి నిర్మల్ లో అక్షరాల నిజమవుతోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్ పాత్ లు ప్రైవేటు వ్యాపారుల పరమయ్యాయి. అధికారుల సాక్షిగా ఈ వాణిజ్య సంస్థలకు విద్యుత్ సరఫరా క్రమబద్ధం అవుతోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే గతంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం కూల్చేసి నూతన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఐతే నిర్మాణంలో జాప్యం ఫలితంగా ఒక వర్గానికి చెందిన వారి ఆక్రమణకు ఈ స్థలం గురవుతోంది. పట్టణ నడిబొడ్డులోని కోట్ల విలువైన పురాతన తహశీల్ ఆఫీసు ప్రాంతం ఇతర అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా చేపట్టాల్సిన నిర్మాణం నిలిచిపోయింది. ఒక వర్గానికి చెందిన వారు ఈ స్థలం ఆక్రమించి నివాస గృహాలు ఏర్పాటు చేసుకోవడం, మిగతా స్థలాన్ని కూడా ఆక్రమించడానికి ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వ స్థలం లేదన్న సాకుతో కలెక్టరేట్ సముదాయాన్ని పట్టణానికి 5 కి.మీ దూరాన ఉన్న ప్రదేశంలో నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం కూల్చి ప్రైవేటు పాలు చేస్తున్న అధికారుల తీరు అంతుపట్టడం లేదు. వాకింగ్ ట్రాక్ పూర్తిగా ప్రైవేటు ఆక్రమణలకు గురవడంతో రోడ్లపై పాదచారులు నడవాల్సిన పరిస్థితి. సాక్షాత్తు జిల్లా అధికారుల సాక్షిగా ఆక్రమణలు జరుగుతున్నా పట్టింపు లేకపోవటంతో ఫుట్ పాత్ వ్యాపారుల ఆగడాలు అధికమయ్యాయి. ప్రధానంగా మయూరి సర్కిల్, ఎన్టీఆర్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీన్ని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పక్క మితి మీరిన వేగంతో లైసెన్స్ లేని వాహన చోదకులు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ప్రధానంగా డాక్టర్స్ లేన్ నుంచి శివాజీ చౌక్ దాకా నడవటం ప్రాణాంతకంగా మారింది. కాగా నిర్మల్ లో ట్రాఫిక్ నియంత్రణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇంతకు ముందున్న ట్రాఫిక్ పోలీసులను తిరిగి తమ స్టేషన్లకు తరలించారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా కుంటు పడింది. దీంతో మైనర్ల వాహనాలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ఆక్రమణలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. అలాగే ఫుట్ పాత్ లను కేవలం పాదచారులు వాడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**చర్యలు తీసుకోండి: సిటిజన్ ఫోరం**

ఇదిలా ఉండగా ఆక్రమణలు నియంత్రించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని సిటిజన్ ఫోరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించింది. ఈ దిశగా చర్యలు చేపట్టి నిర్మల్ ప్రత్యేకతను కాపాడాలని ఆ వినతి పత్రం లో కోరారు.

# సర్వేయర్లు నిబంధనలు పాటించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్




**కలంజ్యోతి, మంచిర్యాల :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని లైసెన్స్డ్ సర్వేయర్లు పూర్తిగా తెలుసుకొని ఉండాలని, సమస్యల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల శ్రీఉషోదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించి వివిధ రకాల సర్వే నిర్వహించవలసి ఉంటుందని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి వివిధ సందర్భాలు ఉంటాయని తెలిపారు, సర్వే ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని, గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, సరిహద్దు వివాదాల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు అందించే శిక్షణ ఎంతో ముఖ్యమని, శిక్షణలో ప్రతి అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, చట్టంను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమానికి 162 మంది హాజరు కావలసి ఉండగా 153 మంది హాజరయ్యారని తెలిపారు. ఆధునిక సాంకేతికను వినియోగించుకొని సర్వేలో చిత్తశుద్ధితో పని చేయాలని, సర్వే ప్రక్రియలో ప్రతి చర్యను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## యోగాపై అవగాహన సదస్సు

**కలంజ్యోతి, నాగారం :** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం,శ్రేయస్సును మెరుగుపరచడంలో యోగా విస్తారమైన సామర్థ్యం గురించి అవగాహన కల్పించడం, మన దేశ పౌరులలో యోగాభ్యాసాన్ని పెంపొందించడం లక్ష్యంగా ప్రతిసంవత్సరం జూన్ 21వ తేదిన అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుగుతుంది. ఈ 2025వ సంవత్సరం కూడా జూన్ 21వ తేదిన జరుగు పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మన దేశ ప్రధానమంత్రి సూచించిన థీమ్/నేపథ్యం 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా'ని ఆసరా చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలమేరకు 27 మే 2025 నుండి మొదలుకొని 25రోజుల పాటు దశాబ్ది వేడుకలు రాష్ట్రవ్యాప్త ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వర్ధమానుకోట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో మన వర్ధమానుకోట గ్రామ పంచాయతిలో ఈ రోజు ఆశా వర్కర్లకు,సమాజ సేవకులకు కామన్ యోగా ప్రోగ్రామ్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయేందర్ మాట్లాడుతూ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో యోగా ఒక ముఖ్యమైన భాగమని, యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ఈ రోజు నుండి 21 జూన్ వరకు వివిద వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకొని ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, సతీష్, యోగా శిక్షకురాలు శిరీష, గ్రామ కార్యదర్శి అంబేద్కర్, శ్రీనివాసాచారి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

### జూన్ 9, 10 తేదీలలో రెండు రోజుల శిక్షణ

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి కి సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి లు వినతిపత్రం అందజేశారు. జూన్ 9, 10 వ తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది జర్నలిస్టులకు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ప్రొఫెసర్లతో, సీనియర్ జర్నలిస్టులతో తరగతులు జరుగుతాయని అన్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనాలను మీడియా అకాడమీ ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. రెండు రోజులు శిక్షణ పొందిన వారికి మీడియాకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి అధ్యక్షులు ఎంఏ కరీం, ఉప్పల్ నియోజకవర్గం యూనియన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తిరుపతి రెడ్డి, నరోత్తం రెడ్డిలు పాల్గొన్నారు.

6 కలంజ్యోతి
బుధవారం 28.05.2025 General News



## రైస్ మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** రైస్ మిల్లర్లు ఖరీఫ్ 202425 సంబంధించి సి.ఎం.ఆర్. డెలివరీ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సి.ఎం.ఆర్. డెలివరీ, 202223 రబీ ధాన్యం వేలం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 202425 ఖరీఫ్ సంబంధించిన సి.ఎం.ఆర్. (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ ఎ.సి.కె. లక్ష్యాలను సైతం పూర్తి చేసి రబీకి సంబంధించి ధాన్యం ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. సకాలంలో డెలివరీ పూర్తి చేయని పక్షంలో ధాన్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. మిల్లుల వారీగా పెండింగ్ లో ఉన్న లక్ష్యాల వివరాలను తెలుసుకొని అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పని చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 202223 రబీకి సంబంధించి ధాన్యం వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఆర్.ఐ. మురళీకృష్ణ, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

**కలంజ్యోతి, జగిత్యాల :** సైబర్ నేరాల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని అశోక్ కుమార్ అన్నారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్, 5 అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5s విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాల ను తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన ఆక్సిడెంట్ జోన్ లుగా, బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24x7 గస్తీ నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, ఎస్ఐలు ఉమాసాగర్, సతీష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావం

- కళాకారుల సంక్షేమమే ఫోక్ ఇండస్ట్రీ లక్ష్యం
- ప్రభుత్వం 500 గజాల స్థలం ఇచ్చి కళాకారులను ఆదుకోవాలి
- తెలంగాణ సాధనలో కళాకారులది ప్రధాన పాత్ర



**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** గత 30 సంవత్సరాల నుండి కళనే నమ్ముకుని జీవనం సాగిస్తూ, తెలంగాణ ఉద్యమంలో 20 సంవత్సరాల పాటు ఎనలేని కృషిచేసి తెలంగాణ రావడంలో ప్రధాన భూమిక వహించింది కళాకారులని పలువురు నేతలు అన్నారు, కొంపల్లి లోని హోటల్ వన్ లో జరిగిన తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సమావేశంలో వివిధ రంగాల కళాకారులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కలకు జీవం పోస్తూ ఎవరికి వారికి జీవిస్తున్న మనం ఇప్పుడు ఒకటై ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కళాకారులకు ఎటువంటి చేయూతలేదని ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మా కళాకారులను ఆదుకోవాలని వారి కుటుంబాల్లో వెలుగు నింపాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

**తీర్మానాలు...**

ప్రభుత్వం ఒక్కొక్క కళాకారునికి 500 గజాల భూమిని కల్పించాలి. కళాకారులకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మంజూరు చేయాలి. వృద్ధ కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలి. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తూ ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలి. కళాకారులకు ఆరోగ్య భీమా ఇస్తూ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలి. ఈ సందర్భంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కమిటీని ప్రకటించడం జరిగింది అధ్యక్షుడిగా పత్తిపాటి రమణాకర్, ప్రధాన కార్యదర్శిగా సత్తార్ బాయ్, కోశాధికారిగా గజ్వేల్ వేణు, ఉపాధ్యక్షులుగా జీవిల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ సలహాదారులుగా దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజ్, అభినయ శ్రీనివాస్, కోదారి శీను, అంబటి వెంకన్న, బైరాగి మోహన్, కళాంజలి రాజేష్, దత్తాత్రేయ, చికోడు నరసింహులు, కాదారి గణేష్, వస్పరి విష్ణు, కాపర్తి మల్లికార్జున్ ఉన్నారు. కోర్ కమిటీ సభ్యులుగా జడల రమేష్, మాట్ల తిరుపతి, శంకర్ బాబు, వడ్లకొండ అనిల్, బుర్ర సతీష్, పొద్దుపొడుపు శంకర్, మాంకాల ప్రసాద్, మల్లిక్ తేజ, పాత శ్రీధర్, గణ శ్యామ్, బుర్ర నటరాజ్, ఓరుగంటి శేఖర్, కోదండ సంతోష్, తేలు విజయ, వినోద్, విజువల్ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా బీఆర్.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి, గొల్లపల్లి ఆంజనేయులు కళాకారులను శాలువలు మేమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు.

## అహల్యా భాయ్ హోల్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

### సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్



**కలంజ్యోతి, జగిత్యాల :** రాణి అహల్యాబాయ్ హోల్కర్ జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్ అన్నారు. సామాజిక సమరసత వేదిక జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహారాణి అహల్యాబాయ్ హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవ ముగింపు కార్యక్రమము స్థానిక గీత విద్యాలయం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానము చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించి రాజ్యానికి మహారాణిగా ఉంటూ పాలనాపరంగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. మహిళా సాధికారత కోసం కృషిచేసిన మహనీయురాలు హోల్కర్ అని కొనియాడారు. విదేశీ దండయాత్రలో దేశంలో దెబ్బతిన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాశీ, మధుర, సోమనాథ్, అయోధ్య తదితర దేవాలయాలను పునరుద్ధరించడమే కాకుండా అక్కడ భక్తుల కోసం అన్న సత్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రాణి అహల్యాబాయ్ హోల్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ అంకం లక్ష్మణ్, డా.అరుణ సామాజిక సమరసత వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు కనికరం లచ్చన్న, కార్యదర్శి సోమిరెడ్డి భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు సింహరాజు సూర్యనారాయణ, ఆకుతోట వెంకటరమణారెడ్డి, ఇల్లెందుల పురుషోత్తం, భోంధుకూరి శ్రీనివాస్, భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎసిఎస్ రాజు, అశోక్ రావు, లక్ష్మణరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుతో మహిళకు గాయాలు

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో మండలంలోని తాటిపెల్లి గ్రామానికి చెందిన రవి ఇంటికి సమీపంలో పిడుగు పడడంతో ఇంటి లోపల ఉన్న మహిళపై ఇంటి పైకప్పు విరిగిపడింది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కుటుంబీకులు 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.



# ట్రోల్స్ నా విజయాన్ని ఆపలేవు

ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో బాలీవుడ్ సినీ తారలు స్పెషల్ దుస్తులు ధరించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. అయితే ఈ వేడుకల్లో ఊర్వశి రౌటేలా కూడా పాల్గొని సందడి చేసింది. ఇక ఆమె ఇందులో మెట్లపై నిల్చొని ఫొటోలకు పోజులిచ్చింది. ఇక ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఊర్వశి కేన్స్ వేడుకల్లో పాల్గొన్న వారికి ఇబ్బంది కలిగించిందని దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు. కామన్ సెన్స్ ఉపయోగించకుండా అక్కడ ఫొటోలు దిగడం అవసరమా అని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, ఈ విషయంపై ఊర్వశి క్లారిటీ ఇస్తూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ సంచలన పోస్ట్ పెట్టింది. 'నెటిజన్లు కొంతమంది నేను మెట్లపై దారిని బ్లాక్ చేశానంటూ తప్పుగా ప్రచారం చేస్తున్నారు. అక్కడ ఫొటోలు దిగడానికి నేను అనుమతి తీసుకున్నాను. కేన్స్ వేడకలో ప్రతి నియమాన్ని పాటించాను. ఎంతో గౌరవంగా ఆ వేడుకలకు హాజరయ్యాను. ఈ విమర్శలకు ప్రధాన కారణం అసూయ మాత్రమే. ఇలాంటి ట్రోల్‌స్‌ను నేను పట్టించుకోను. ఇలాంటివి నా విజయాన్ని ఆపలేవు. మీరు నన్ను ఎంత ట్రోల్ చేసినా ఇతరుల లాగా డబ్బులు చెల్లించను. నేను ఐశ్వర్య రాయ్ అవ్వడానికి ప్రయత్నిస్తున్నాఅనుకుంటున్నారా. ఒకరిలా ఉండటానికి నేను ఇండస్ట్రీకి రాలేదు. కేన్స్ నన్ను కలిసిపోవడానికి ఆహ్వానించలేదు. నేను ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్శణగా నిలబడటానికి వచ్చాను. నా లుక్, నా స్టైల్ మీకు అసౌర్యాన్ని కలిగిస్తే చూడకండి. నేను అందరికీ నచ్చేలా ఉండాలని అనుకోను. నేను బాణసంచా కాల్చిన షాంపైన్ లాంటిదాన్ని' అని రాసుకొచ్చింది. ఇక ఈపోస్ట్ చూసిన నెటిజన్లు కొందరు ఆమెకు అండగా నిలుస్తుంటే.. మరికొందరు మాత్రం మళ్లీ ట్రోలింగ్ మొదలెట్టారు.